క్లుప్తంగా

పాఠశాలల్లో తనిఖీ..



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

కూసుమంచి: మండలంలోని జీళ్లచెరువు, కూసుమంచి, గంగబండ తండా పాఠశాలలతో పాటు కస్తూర్బా పాఠశాలలను ఎంఈఓ బీవీ రామాచారి సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుశాతాన్ని పరిశీలించి వారి అభ్యసనా సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం నాణ్యంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంఈఓ సూచించారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు.

ఆకట్టుకుంటున్న ఎగ్జిబిషన్



ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని ఎస్‌ఆర్‌అండ్‌బీ జీఎన్‌ఆర్ కళాశాల గ్రౌండ్‌లో గత నెల 20న ప్రారంభించిన ఇండియన్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ షాపింగ్ ఫెస్టివల్ ఎగ్జిబిషన్ నగర వాసులను ఆకట్టుకుంటోందని నిర్వాహకులు జునేద్ ఇక్బాల్, అష్రఫ్ అలి తెలిపారు. ప్రతీరోజు ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్ ఈనెల 31 తో ముగుస్తుందని, ఉచిత ప్రవేశం కల్పించినట్లు తెలిపారు. డెబిట్, క్రెడిట్ కార్డు కొనుగోలుపై 5 శాతం అదనపు డిస్కౌంట్ కల్పిస్తున్నామన్నారు. దాదాపు 50 వేల వెరైటీలు ఒకే ప్రదేశంలో లభిస్తున్నాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భూ తగాదాలో ఐదుగురి అరెస్టు

తిరుమలాయపాలెం: మండలంలోని మేకల తండా గ్రామంలో ఈనెల 10న జరిగిన భూ తగాదాలు, గొడవలో ఐదుగురిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. భూతగాదాలకు తోడు పాతకక్షల కారణంగా ఈనెల 10న బోడ రాందాస్ కుటుంబ సభ్యులు గ్రామానికే చెందిన బోడ హచ్చా కుటుంబీకులపై కర్రలతో దాడికి చేశారు. ఘటనలో హచ్చా భార్య సుజాత తలపై బలమైన గాయం కాగా, ఆమె కుమార్తె రేణుక పోలీసులకు ఫిర్యాదుచేసింది. దీంతో బోడ రామదాసు, సూర్యతేజ, హైమావతి, బానోత్ హాము, బానోత్ మంగిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

సర్వీస్ చార్జీలు తగ్గించాలి

ఖమ్మం మయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): రవాణా శాఖలో పెంచిన సర్వీస్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మంలో సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు తుమ్మ విష్ణు మాట్లాడుతూ.. సర్వీస్ చార్జీలు ట్యాక్స్ పెంచడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ స్వర్ణలతకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జిల్లా ఉపేందర్, నాయకులు ధరావత్ రాందాస్, బోట్ల సాగర్, వనం వీరభద్రం, రాములు, రెడ్డి, నరేష్, వేణు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కూలీ
వినోద	మహావతార్ నర్సింహా
సాయిరాం	మేఘాలు చెప్పిన ప్రేమకథ, పరదా
ఆదిత్య	స్టాలిన్
శ్రీనివాస	వార్ 2

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	46	బచ్చలికూర	4
వంకాయ	26		20
బెండకాయ	26	పాలకూర	3
పచ్చిమిర్చి	46		20
కాకర	30	చుక్కకూర	3
బోడ కాకర	150		20
బీర	56	తోటకూర	4
దొండ	40		20
పొట్లకాయ	46	గోంగూర	4
చిక్కుడు	66		20
గోరుచిక్కుడు	36	మెంతికూర	3
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	45	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		25
చామగడ్డ	34	పుదీన	1
క్యారెట్	46		20
బీట్‌రూట్	36	-ఖమ్మం వ్యవసాయం	

ముక్కు మూసుకోవాల్సిందే..

కంపుతో తల్లడిల్లుతున్న ఖమ్మం

- రోడ్ల వెంట పేరుకుపోతున్న చెత్త
- ప్రజలకు తీవ్ర ఇబ్బందులు



ఖమ్మం - ఇల్లెందు మార్గంలో పడేసిన వ్యర్థాలు

ఖమ్మంఅర్బన్: పచ్చదనం పరిశుభ్రత అంటూ పెద్ద ఎత్తున ప్రచారం, కార్యక్రమాలు సాగుతున్నా మరోవైపు కొంత మంది చేస్తున్న చర్యలకు ఖమ్మం నగర వాస్తవ చిత్రం మాత్రం విరుద్ధంగా కనిపిస్తోంది. ప్రధాన లింకు రోడ్ల అంచుల్లో, ఖాళీ స్థలాల్లో చెత్త కుప్పలు పేరుకుపోతూ నగరానికి చెడ్డపేరు తెస్తున్నాయి. వర్షాకాలం కారణంగా ఈ వ్యర్థాలు కుళ్లిపోతూ అసహనానికి గురిచేస్తున్నాయి. బల్లేపల్లి, పాండురంగాపురం, అల్లిపురం రోడ్డు, కొత్తగూడెం రోడ్డు, ఖమ్మం- వైరా బైపాస్, మమత బైపాస్ రోడ్డు వంటి ప్రధాన రోడ్ల వెంట చెత్తకుప్పలు ఉండటంతో పక్కన నివసించే ఇళ్ల వారు భరించలేని దుర్వాసనతో తల్లడిల్లుతున్నారు. రాకపోకలు సాగించే ప్రజలు ముక్కు మూసుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

డంపింగ్‌యార్డ్ ఉన్నా వాడని వైనం..

నగరంలో ప్రత్యేక డంపింగ్‌యార్డ్ ఉన్నప్పటికీ కొంతమంది వ్యాపారులు, వ్యక్తులు దానిని వాడకుండా రాత్రివేళల్లో రోడ్ల అంచుల్లో వ్యర్థాలను పడేస్తున్నారు. ఎవరు చూడని ప్రదేశాల్లో చెత్తను పారేస్తుండటంతో లింకు రహదారులన్నీ చెత్త కేంద్రాలుగా మారిపోయాయి. కొంతమంది ఖాళీ స్థలాల్లో సైతం చెత్త వేస్తూ వాటిని డంపింగ్‌యార్డులుగా మారుస్తున్నారు.

కనుమరుగవుతున్న పచ్చదనం..

నగరంలో ఒకవైపు మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందిస్తున్నా, అదే రోడ్ల వెంట చెత్త పడేయడంతో ఆ పచ్చదనం కనుమరుగై దుర్వాసన మాత్రమే మిగులుతోంది. పరిశుభ్రతపై జరుగుతున్న ప్రచారం కేవలం పేపర్‌వర్క్‌గానే మిగిలిపోతోందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోజూ ఇల్లు బయటకు రాగానే చెత్త కుప్పల వాసనే మేము పీల్చుకోవాల్సి వస్తోందని, పడేసిన వ్యర్థాలు ఆహారం వెతుకులాటల్లో ఆయా ప్రాంతాల్లో కుక్కలు చెత్తలో తిరిగుతూ భయపెడుతున్నాయని వాపోతున్నారు. పట్టణంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తామని చెబుతున్న అధికారులు ఈ సమస్యపై దృష్టి పెట్టడం లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల వెంట పేరుకుపోతున్న చెత్తపై వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



చైతన్యనగర్‌లో పార్కు మధ్యలో...

పందుల స్వైరవిహారం..

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ఎస్‌ఎస్‌సీ క్యాంపులో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. అంబేద్కర్ గురుకులం, ఎస్సీ వసతిగృహాల చుట్టూ గోడల వెంట పందులు బురదలో దొర్లి, అపరిశుభ్ర వాతావరణాన్ని నెలకొల్పుతున్నాయి. దీంతో పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. అసలే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న ఈ సమయంలో గురుకులం, వసతిగృహాల చుట్టూ పందులు సంచరిస్తుండడంపై అధ్యాపకులు, ఉపాధ్యాయులు, వసతిగృహాల సంక్షేమ అధికారలు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వసతిగృహాలు, గురుకులం చుట్టు పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి, డ్రెయినేజీలను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.



అంబేద్కర్ గురుకుల కళాశాల వెనుక పందుల సంచారం

వేతనాలు చెల్లించాలని కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న కార్మికులు

ఖమ్మంవైద్యవిభాగం: పెండింగ్ వేతనాలు చెల్లించాలని పెద్దాస్పత్రి కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మూడు నెలలుగా కార్మికులకు వేతనాలు చెల్లించకపోవటంతో సోమవారం విధులు బహిష్కరించి ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న పేషంట్ కేర్, సెక్యూరిటీ, శానిటేషన్ కార్మికులు ఆస్పత్రి ఎదుట బైటాయించి వేతనాలు చెల్లించేదాకా విధుల్లో చేరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎంసీహెచ్ భవనంలోని షెడ్డులో బైటాయించి నిరసన తెలపడంతో మెడికల్ సూపరింటెండెంట్ యం.నరేందర్ కాంట్రాక్టర్‌ను పిలిపించి మాట్లాడారు. కాంట్రాక్టర్‌కు సంబంధించిన పెండింగ్ బిల్స్ ప్రభుత్వం నుంచి విడుదల కావటంతో వెంటనే మూడు నెలలకు సంబంధించి కార్మికుల వేతనాన్ని చెక్కు రూపంలో అధికారులు అందజేశారు. దీంతో కాంట్రాక్టర్ మూడు నెలల వేతనాన్ని కార్మికుల ఖాతాల్లో జమచేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతులు..

ఖమ్మంరూరల్: పెదతండాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణిలో భాగంగా సోమవారం మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు మున్సిపాలిటీలో ప్రజావాణిలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇందిరమ్మ కాలనీలో క్రీడా ప్రాంగణం నిరుపయోగంగా ఉందని, డ్రెయినేజీల్లో పేరుకుపోయిన మురుగునీటిని తొలగించాలని, వెంటనే ఇంటి నంబర్లు ఇవ్వాలని కోరారు. సమస్యలను విన్న కమీషనర్ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

నేలకొండపల్లి: పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. మండల కార్యదర్శి కె.వీ.రెడ్డి మాట్లాడుతూ.. కుక్కల బెడద, వీధిలైట్లు, తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. భాస్కర్‌రావు, కె.వీ.చారీ, కె.కోటేశ్వరరావు, నరసింహారావు, మున్నంగి లక్ష్మి, సామాల మల్లికార్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.


కూసుమంచి: మండలంలోని పలు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యాన నాయకులు తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షురాలు పుణ్యవతి, నాయకులు విజయారెడ్డి, వీరూ గౌడ్, వెంకటేశ్వర్లు, రవి రాథోడ్, మహేందర్ నాయక్, వీరన్న, బెల్లం మురళి, ఉపేందర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి, మోతీలాల్ పాల్గొన్నారు.

కామేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరుగ్యారంటీలతో పాటు 420 హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని, గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు జర్పుల రామారావు, నాయకులు కృష్ణ, రమణయ్య, రవీందర్, శ్రీను, రంగారావు, వెంకటనారాయణ ఉన్నారు.


చెరువు ఆక్రమణను అరికట్టాలి

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం చెరువు ఆక్రమణను అరికట్టి, చెరువును కాపాడాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పాలక వర్గం కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం జిల్లా కార్యదర్శి, మత్స్య సొసైటీ డైరెక్టర్ బోయిన బలరాం మాట్లాడుతూ.. చెరువును పరిసర ప్రాంతాలకు చెందిన కొంత మంది దాదాపు 200 ఎకరాలను ఆక్రమించి సాగు చేస్తున్నారని, 850 ఎకరాల విస్తీర్ణం ఉండాల్సిన చెరువు కేవలం 650 ఎకరాల మాత్రమే ఉందన్నారు. చెరువు ను ఆక్రమణ నుంచి విముక్తి కల్పించాలని పలుమార్లు అధికారులను కోరినప్పటికీ పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చెరువు హద్దులు చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఖాసిం, ఉపాధ్యక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

పాలకుల వైఫల్యంతోనే యూరియా కొరత



ఖమ్మంరూరల్: వినతి అందజేస్తున్న నాయకులు



రఘునాథపాలెం: ఆందోళన చేస్తున్న నాయకులు

ఖమ్మంరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాల కారణంగా రైతులు యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, యూరియా కొరత లేకుండా చూడాలని కోరుతూ సోమవారం సీపీఐ, ఏఐకేఎస్ ఆధ్వర్యంలో తహసీల్ ఎదుట ధర్నా చేసి తహసీల్దార్ రాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఏఐకేఎస్ మండల కార్యదర్శి శ్రీనాథ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సుధాకర్, వెంకటేశ్వర్లు, రంగారావు, నాగేశ్వరరావు, రామకృష్ణ, రవి ఉన్నారు.

రఘునాథపాలెం: సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన నిర్వహించారు. సంఘం మండలాధ్యక్షుడు బాగం ప్రసాద్, నాగేశ్వరరావు, సురభి శ్రీను, తాతా బసవయ్య, బానోత్ వస్రం, రాందాస్ పాల్గొన్నారు.

నేలకొండపల్లి: యూరియా కొరత తీర్చాలని కోరుతూ రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. సంఘం మండల ప్రధాన కార్యదర్శి పాల్తీయ శ్రీనివాసరావు, సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, కర్నాటి భానుప్రసాద్, కృష్ణ, ప్రసాద్, మాధవరావు, అయోధ్య, అశోక్, భిక్షం, వెంకటేశ్వర్లు, ఠాకూర్‌సింగ్, రూప్లా, బాలాజీ, వీరస్వామి ఉన్నారు

కూసుమంచి: యూరియా కొరత తీర్చాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల కార్యదర్శి భూక్యా నరసింహా, భూక్యా ప్రసాద్, జిల్లా లింగయ్య, సునావత్ శ్రీను, నాగు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో యాజమాన్యం

ఖమ్మం అర్బన్: జేఎన్‌టీయూ సెమిస్టర్ ఫలితాల్లో నగరంలోని అల్లీపురంలో బొమ్మ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులతో ప్రతిభ కనబర్చారని విద్యా సంస్థల ఛైర్మన్ రాజేశ్వరరావు అన్నారు. ఈ మేరకు సోమవారం ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ బ్రాంచుల్లోని 78 మంది విద్యార్థులు 80 శాతం పైగా మార్కులు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బొమ్మ సత్యప్రసాద్, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, ప్రిన్సిపాల్, డీన్‌లు తదితరులు ఉన్నారు.

'యశోద'లో మెరుగైన చికిత్స

ఖమ్మం మామిళ్లగూడెం: ఎలుకల మందు మింగిన బాలుడికి హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద ఆస్పత్రుల వైద్యులు సరైన చికిత్స చేసి ప్రాణాలు కాపాడారు. ఈసందర్భంగా ఖమ్మంలో సోమవారం చికిత్స వివరాలను యశోద ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్, డయాబెటాలజిస్ట్ సింగరాజు దిలీప్‌కుమార్ వెల్లడించారు. ఖమ్మం రూరల్ మండలం వెంకటాయపాలెం చెందిన 16ఏళ్ల బాలుడు ఎలుకల మందు మింగగా, స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించినా ఫలితం లేక యశోద హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. దీంతో వివిధ రకాల చికిత్స అనంతరం కోలుకున్నాడని దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో బాలుడి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలి

కామేపల్లి: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సింగరేణి సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై సాయికుమార్ ఉత్సవ కమిటీ నిర్వాహకులకు సూచించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.. మండపాల వద్ద నిబంధనలు పాటించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు.

సంఘం బలోపేతానికి కృషి

ఖమ్మం మయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): సంఘం బలోపేతానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని సీనియర్ సిటిజన్స్ సంస్థ వైస్ చైర్మన్ ఆర్.రవీందర్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం నగరంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ ప్రధాన కార్యదర్శి సాధినేని జనార్దన్‌రావు, కోశాధికారి కొత్త సత్యనారాయణ రెడ్డి, నాయకులు గుదిమళ్ల సూర్య ప్రకాశరావు, రిటైర్డ్ డీఎస్పీ కేదాసు నరసయ్య, శ్రీహరి, నాగేశ్వరరావు, అనాళి రాధాకృష్ణ, మోహనరావు, వెంకటేశ్వర్లు, మల్లం ఆంజనేయులు పాల్గొన్నారు.

కేఎంసీ సమాచారం..

గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరించిన కమిషనర్..



ఫిర్యాదు పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుండి కమిషనర్ అభిషేక్ అగస్త్య ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల నుండి అందే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు కమిషనర్ సూచించారు. నార్త్, సౌత్ జోనల్ కార్యాలయాల పరిధిలోని ప్రజలు అక్కడ కార్యాలయాల్లో ప్రతి సోమవారం ఏర్పాటు చేసే గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదులు చేసేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

డీసీగా శ్రీనివాసరావు బాధ్యతలు

ఖమ్మం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్‌గా కె.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. తొలుత కమిషనర్ అభిషేక్ అగస్త్యను మర్యాదపూర్వకంగా కలిసి విధుల్లో చేరారు. డీసీగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావుకు ఏఎంసీ అనిల్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్యలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేఎంసీకి సంబంధించిన పలు అంశాలపై డీసీ వారితో చర్చించారు.



శ్రీనివాసరావు

మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలి



విగ్రహాలను పంపిణీ చేస్తున్న మేయర్ నీరజ



బీజేపీ ఆధ్వర్యంలో..

ఖమ్మంమయూరిసెంటర్: మట్టి గణపతి విగ్రహాలనే పూజించి, పర్యావరణాన్ని పరిరక్షించాలని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. వినాయక చవితిని పురస్కరించుకొని సోమవారం కేఎంసీ కార్యాలయంలో మేయర్ నీరజ మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కార్పొరేషన్ పరిధిలో భక్తుల కోసం అధికారులు మట్టి విగ్రహాలను తయారు చేయించి పంపిణీ చేస్తున్నారు. నగరంలో ఐదు పాయింట్లలో విగ్రహాలను పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మట్టి విగ్రహాలు అవసరమైన భక్తులు మున్సిపాలిటీలు ఏర్పాటు చేసిన పాయింట్లలో పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమ జోహర, కార్పొరేటర్ రాపర్తి శరత్, ఏఎంసీ అనిల్ కుమార్, ఏసీపీ వసుందర, టీఎంసీ జి.సుజాత, సీవోలు పాల్గొన్నారు.

ఐక్యతకు ప్రతీక వినాయక చవితి

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): వినాయక చవితి కేవలం పూజా పర్వం కాదని సామాజిక ఐక్యతకు ప్రతీకని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు నగరంలో బీజేపీ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రతీ శుభారంభానికి అవసరమని, ఈ పండుగ మన వ్యక్తిగత భక్తిని మాత్రమే కాకుండా సమాజంలో ఐక్యతను బలోపేతం చేస్తుందన్నారు. మండపాలు కేవలం పూజా వేదికలు మాత్రమే కాకుండా, సమాజం కలిసే వేదికలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నల్లగట్టు ప్రవీణ్ కుమార్, తొడుపునూరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్టును పూర్తి చేయాలి

ఖమ్మంరూరల్: ఉమ్మడి జిల్లాలో 7 లక్షల ఎకరాలకు నీరందించే సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, వెంటనే ప్రాజెక్టను పూర్తి చేసి సాగునీరు అందించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని కామంచికల్‌లో జరిగిన సంఘం మండల మహాసభలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి వాటి ఊసే ఎత్తడంలేదని, దీంతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాయకులు మాదినేని రమేష్, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, దొడ్డ వెంకటప్పయ్య, వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, ఏలుకూరి ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు చూపించాలి

తిరుమలాయపాలెం: మండల కేంద్రంలో గత ప్రభుత్వంలో 130 మందికి ఇళ్ల పట్టాలివ్వగా ఇప్పటివరకు పొజిషన్ చూపించలేదని ఆరోపిస్తూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట లబ్ధిదారులు ఇళ్ల పట్టాలతో ఆందోళన చేపట్టారు. స్పష్టమైన హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేదిలేదని కార్యాలయం ఎదుట కూర్చోవడంతో తహసీల్దార్ విల్సన్, ఎంపీడీఓ సిలార్‌సాహెబ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకవెళ్లారు. వారం రోజుల్లో సమస్యకు పరిష్కారం చూపుతామని జిల్లా అధికారుల నుండి హామీ రావడంతో ఆందోళన విరమించారు. పార్టీ మండల కార్యదర్శి శ్రీను, నాయకులు నాగేశ్వరరావు, శాఖ కార్యదర్శి వెంకటేష్, యూసుఫ్, హరీష్, కదారి వెంకటనారాయణ, కాశమ్మ, ఉమా, మైబు మట్టి దుర్గాప్రసాద్, రామావత్ శ్రీనివాస్, రంజాన్, ఉమేష్ పాల్గొన్నారు.

'ఆశా'లకు ఫిక్స్‌డ్ వేతనం ప్రకటించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

ఖమ్మంమయూరిసెంటర్(ఖమ్మం మామిళ్లగూడెం): ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం ప్రకటించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మ విష్ణువర్ధన్ డిమాండ్ చేశారు. ఆశాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆశావర్కర్ల పైన ఏఎన్‌ఎంలు, సూపర్‌వైజర్లు వేధింపులు ఆపాలన్నారు. అర్హత ఉన్న వారిని ఏఎన్‌ఎంలుగా ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించకుంటే చలో హైదరాబాద్ కార్యక్రమానికి కూడా వెనుకాడమని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. జిల్లా ఆశావర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు జె.మంగమ్మ, అమల, రమణ, నాగమణి,రాధ, జ్యోతి, సృజన, సుధా, విజయ, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

కమీషన్ ఇవ్వకుంటే ఆందోళనలకు సిద్ధం



ఖమ్మంరూరల్: వినతిపత్రం అందజేస్తున్న డీలర్లు



ఖమ్మం అర్బన్: నిరసన వ్యక్తం చేస్తున్న రేషన్ డీలర్లు

ఖమ్మం అర్బన్: రేషన్ డీలర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేర్వేరుగా ఇస్తున్న కమీషన్‌ను పాత పద్ధతిలోనే జమయ్యేలా చూడాలని, లేనిపక్షంలో తీవ్రమైన ఆందోళనలకు దిగుతామని రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బానోతు వెంకన్న అన్నారు. ఐదు నెలలుగా కమీషన్ బకాయిలు చెల్లించకపోవడంతో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రేషన్‌డీలర్లు అర్బన్ తహసీల్ ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జానీమియా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దొండా దుర్గయ్య, నగర అధ్యక్షుడు షేక్ ఇబ్రహీం, వట్నాల బాబు, సత్యనారాయణ, షరాబు మహేశ్, విబూది నాగేశ్వరరావు, షేక్ రహీమా, సీహెచ్. శ్రీనివాసరావు, బలియుద్దీన్, సుశీల, రమణమ్మ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్: సమస్యలను పరిష్కరించాలని, హామీలను తక్షణమే నెరవేర్చాలని కోరుతూ రూరల్ మండల రేషన్ డీలర్లు తహసీల్దార్ రాంప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకన్న, నాయకులు కె. వెంకటనారాయణ, పుల్లయ్య, రామయ్య, కవిత, సైదిరెడ్డి పాల్గొన్నారు.

కామేపల్లి: వెంటనే కమీషన్ విడుదల చేయాలని కోరుతూ తహసీల్దార్ సుధాకర్‌కు మండల డీలర్లు వినతి పత్రాన్ని అందించారు.

నేలకొండపల్లి: పెండింగ్ కమీషన్‌ను వెంటనే చెల్లించాలని రేషన్ డీలర్లు స్థానిక తహసీల్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న కమీషన్‌తో పాటు ప్రతీ నెలా డీలర్ల ఖాతాలో జమ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి సత్యనారాయణ, వడ్డె సుబ్బారావు, అమరనేని శ్రీనివాసరావు, సోమయ్య, పవన్ పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం కమీషన్ చెల్లించి ఆదుకోవాలని కోరుతూ రేషన్ డీలర్లు తహసీల్దార్ విల్సన్‌కి వినతిపత్రం అందజేశారు. రేషన్‌డీలర్లు ముత్తయ్య, నవీన్, సుందర్‌రావు, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



కామేపల్లిలో..



తిరుమలాయపాలెంలో..